క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కంచరపాలెం: జోన్–2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ 11 కేవీ కంచరపాలెం ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గానగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్, తోటవీధి, మల్లసూరివీధి, గొల్లకంచరపాలెం, గవరకంచరపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వైభవంగా సారె ఊరేగింపు



గౌరీ పరమేశ్వరులకు సారె తీసుకొస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఆర్‌కే పురంలోని గౌరీపరమేశ్వరుల ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో దేవతామూర్తులకు సారె సమర్పించారు. మహిళలు వివిధ రకాల పిండి వంటలు,పండ్లు,వస్త్రాలను సారె రూపంలో ఊరేగింపుగా మందిరం వరకూ తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మహిళలు గౌరీదేవి కీర్తనలు ఆలపించారు. పలువురు మహిళలు కోలాటం చేశారు.మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టుకార్డు ఉద్యమం



స్టీల్‌ప్లాంట్ ఎల్‌ఎంఎం విభాగం వద్ద పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు పెద్ద ఎత్తున నినదించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమం ప్లాంట్ విభాగాల్లో ఉధృతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం ఎల్‌ఎంఎంఎం, కోక్‌ఓవెన్స్, సీఈడీ విభాగాల ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పోస్టు కార్డులు పెద్ద ఎత్తున పంపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రై వేటీకరించాలనే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. పలు విభాగాల్లో జరిగిన కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఏయూలో 'అమెరికా అల్లుడు' నాటిక ప్రదర్శన

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కేవీ గోపాలస్వామి ఆరు బయలు రంగస్థలంలో ఏయూ రంగస్థల విభాగం ఆధ్వర్యంలో అమెరికా అల్లుడు హాస్యనాటిక ప్రదర్శిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ప్రదర్శించే ఈ నాటికను నగరవాసులందరూ హాజరై తిలకించాలని కోరారు.

భీమిలిలో జాబ్‌మేళా నేడు

భీమునిపట్నం: భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, కల్యాణి జ్యువెలర్స్, మాస్ మెరైన్ సర్వీస్ ఇండియా, ఎస్.కె.ఎల్ మొదలైన కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఇంటర్, 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు అర్హులు. ఎంపికైన వారు విశాఖపట్నం, గాజువాక, తగరపువలస, భోగాపురం, గోపాలపట్నం, విజయనగరం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుంది.

మనోడే.. వదిలేయ్..!



నాసిరకంగా నిర్మించిన తారురోడ్డు



బాజీ జంక్షన్‌లో దుకాణాలు తొలగించకుండానే వేసిన మెటల్

- రోడ్డు విస్తరణలో కూటమి నాయకుల పక్షపాతం
- ఆక్రమణలు వదిలేసి అస్తవ్యస్తంగా నిర్మాణాలు
- కూటమి నేతల కమీషన్ల పర్వంతో నాసిరకంగా పనులు
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో పనుల్లో డొల్లతనం

విశాఖ విద్య: ప్రభుత్వ నిధులతో చేపట్టే పనులేవైనా పదికాలాలపాటు ప్రజానీకానికి ఉపయోగపడేలా ఉండాలి. చేస్తున్న పనులకు ప్రజామోదం కూడా ఉండాలి. కానీ పశ్చిమ నియోజకవర్గంలో ఇందుకు విరుద్ధంగా పాలన సాగుతోంది. కూటమి నేతల కమీషన్ల పర్వంతో అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారులు కూటమి నేతల సేవలో తరిస్తుండటంతో ప్రజాధనంతో చేపట్టే పనులు అనతికాలంలోనే నిరుపయోగంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయని నియోజకవర్గ వాసులు ఆందోళన చెందుతున్నారు.

పనుల్లో నాణ్యతకు తిలోదకాలు!

ఎస్‌ఏడీ – గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్‌లోని



శ్లాబ్ లేకుండా పూర్తి చేసిన డ్రైనేజీ నిర్మాణం



నాసిరకం మెటల్ వేయడంతో అధ్వానంగా తయారైన కొత్తపాలెం రోడ్

బాజీ జంక్షన్ నుంచి పాత గోపాలపట్నం మీదుగా చంద్రానగర్ అండర్‌పాత్ వరకు, అక్కడి నుంచి కొత్తపాలెం మీదుగా నాగేంద్రనగర్ వరకు ప్రస్తుతం జరుగుతున్న రహదారి మరమ్మతు పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. ఈ దారిలో సుమారు కిలోమీటరున్నర మేర రెండు లేయర్ల బీటీ రోడ్డు నిర్మించేందుకు జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు చేశారు. రెండు బిట్లుగా చేసి, రూ.18 లక్షలు చొప్పున మొత్తం రూ.36 లక్షలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. గుంతలమయంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేస్తుండడంతో ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నప్పటికీ, పనులు జరుగుతున్న తీరుపై మాత్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మెటల్ వేసిన చోట సరైన రివిట్మెంట్ లేకుండానే, దానిపై తారు పోసేస్తున్నారని... సైడ్ బెర్మ్ కూడా వేయకపోవటంతో రోడ్డు మార్జిన్ దిగే సమయంలో వాహనాలు పల్టీ కొడుతున్నాయని ద్విచక్ర వాహనదారులు అంటున్నారు.

ఆక్రమణలు తొలగించకుండానే పనులు

రోడ్డు విస్తరణ పటిష్టంగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్‌లో వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం లేకుండా తగిన కార్యాచరణతో అధికారులు పనులకు ప్రతిపాదనలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ బాజీ జంక్షన్ నుంచి జరుగుతున్న రహదారి మరమ్మతుల పనుల్లో రోడ్డుపై ఉన్న దుకాణాలు తొలగించకుండానే పనులు తూతూ మంత్రంగా లాగించేస్తున్నారు. కూటమి నేతలకు మద్దతుగా ఉన్న వారి దుకాణాల జోలికి వెళ్లడం లేదు. ఇలాంటి పనులు పది కాలాల పాటు ఎలా పదిలంగా ఉంటాయని ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు.

రైల్వే స్టేషన్ రోడ్‌లో ఇవేం పనులు

సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి రోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బీఆర్‌టీఎస్ రోడ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ఉన్న దారిని విస్తరించి, అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా ప్రజానీకం నుంచి డిమాండ్ ఉంది. ఎట్టకేలకు స్పందించిన జీవీఎంసీ అధికారులు తొలుత డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణం కోసం సుమారు రూ.8 లక్షలు కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే ఒకవైపు మాత్రమే డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. డ్రైనేజీపై శ్లాబ్ లేకుండానే ప్రతిపాదనలు చేయడంపై ఉన్నతాధికారులు అక్షింతలు వేయడంతో ఇంజినీరింగ్ అధికారులు మేల్కొని, మరోమారు ప్రతిపాదనలు చేసేందుకు సిద్ధమౌతున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాల్సి ఉన్నప్పటికీ, అధికారులు వాటి జోలికి వెళ్లకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇందులో కూటమి నేతల వసూళ్ల పర్వం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఎంతో ప్రాధాన్యత గల పనులపై జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ రోడ్‌లో అస్తవ్యస్తంగా పనులు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



బహుమతులు అందుకున్న విజేతలతో అతిథులు

మల్కాపురం: విజ్ఞాన వంతమైన సమాజాన్ని నిర్మించడంలో గ్రంథాలయాలు కీలక భూమిక పోషిస్తాయని హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ ప్రజా సంబంధాల అధికారి (పీఆర్వో) కాళీ అన్నారు.గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రంథాలయాల్లో లభించే పుస్తక సంపదను సద్వినియోగం చేసుకొని ఎంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్ సుమన్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. వారం రోజులగా వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో రచయిత కరుకు సత్తిరాజు,గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్,జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సుధకు సత్కారం



కార్పొరేటర్ కొణతాల సుధను సత్కరిస్తున్న ఆర్‌కేపురం, వెంకన్నపాలెం ప్రాంత మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్క నుంచి ఇండస్ట్రియల్ కాలనీ వరకు బీటీరోడ్డు కొత్తగా వేసినందుకు, అలాగే వెంకన్నపాలెం ప్రాంతంలో సీసీ మార్గాలకు మోక్షం కలిగించినందుకు గానూ ఆయా ప్రాంత మహిళలు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధను బుధవారం సత్కరించారు. ఆర్‌కేపురం వద్ద జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయా ప్రాంత మహిళలు మాట్లాడుతూ రోడ్లు శిథిలమై నడవలేని పరిస్థితి ఉండేదన్నారు.తమ ప్రాంత సమస్యలను వార్డు కార్పొరేటర్ సుధ దృష్టిలో పెట్టడంతో ఆమె స్పందించి జీవీఎంసీ నిధులతో కొత్తగా మార్గాలు వేయించారని సంతోషం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ సుధ మాట్లాడుతూ ఇంకా పలు ప్రాంతాల్లో సుమారు రూ.కోటి మేర అభివృద్ధి పనులు జరగాల్సి ఉందన్నారు.త్వరలో ఆ పనులకు మోక్షం కలుగుతుందన్నారు.

మహా ప్రదర్శన విజయవంతానికి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్: వివిధ మార్కెట్లు, దుకాణాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 26న చేపట్టనున్న మహా ప్రదర్శనలో విశాఖ జిల్లా ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. యూనియన్ నాయకుడు పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కుమార్ మాట్లాడారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న ముఠా కళాసీలకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన చట్టపరమైన హక్కులు లేవన్నారు. వీరు పని చేస్తున్న సందర్భాల్లో ప్రమాదాలు జరిగి కాళ్లు, చేతులు విరిగిపోయినా, ప్రాణాలు కోల్పోయినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల నానాటికీ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ రావడం వల్ల వీరు ఉపాధి కోల్పోతున్నారని, అలాగే ట్రాఫిక్ ఆంక్షల వల్ల గొడౌన్స్ నగర శివార్లకు వెళ్లిపోవడంతో ఇక్కడ ఉపాధి కోల్పోతున్నారని, కళాసీల మధ్య పనుల కోసం నిత్యం గొడవలు పడాల్సి వస్తుందన్నారు. ముఠా కార్మికుల రక్షణకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజు రోజుకీ నిత్యావసర ధరలు పెరగడం, ఆదాయాలు తగ్గడం, ఉపాధి కోల్పోవడం వల్ల కార్మికులు జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు ఐక్యంగా చేస్తున్న పోరాటంలో ముఠా కార్మికులు కూడా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వై. రాజు, ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు, వివిధ ముఠా జట్లకు సంబంధించిన మేస్త్రీలు రమణ, నర్సింగరావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన సర్వీస్ రోడ్డుతో ప్రమాదాలు



ఎదురువానిపాలెంలోకి వెళ్లే మలుపు వద్ద ప్రమాదకరంగా రోడ్డు



సర్వీసు రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో, ఐఎన్ఎస్ ఏకొల రక్షణ గోడ పక్క నుంచి ఎదురువానిపాలెం గ్రామంలోకి వెళ్లే బీటీ మార్గం అధ్వానంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం ఇక్కడ బీటీ రోడ్డు నిర్మించినా కొంత కాలానికే పిక్క తేలి, మార్గ మధ్యలో గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఇటువైపు వచ్చే వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మార్గం నుంచి నిత్యం ఎదురువానిపాలెం, ములగాడ గ్రామానికి, శ్రావణి షిప్పింగ్ ప్రాంతాలకు వాహనదారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. పగటి పూట ఏదోలా వాహనాలపై వెళ్తున్నా... రాత్రి వేళ గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ఎదురువానిపాలెం సమీపంలో వచ్చే మలుపు మార్గం వద్ద పిక్క తేలి, పెద్ద గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు మలుపు తిప్పే సమయంలో జారిపడి గాయాల పాలవుతున్నారు. సమస్యపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

టోల్‌గేట్ల ప్రతిపాదన విరమించుకోవాలి

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో మాట్లాడుతూ సంక్రాంతి పండగ నాటికి రోడ్లన్నీ బాగు చేస్తామని చెబుతూ.. ఇక మీదట జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలోని అన్ని ప్రధాన రోడ్లపైన టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. రోడ్ల నిర్వహణ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగిస్తామని, వారు టోల్ ఫీజులు వసూలు చేసుకుంటారని, అందుకు ప్రజల్ని ఒప్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టోల్ గేట్ల నిర్వహణ బాధ్యత తాము తీసుకుంటామని ఎమ్మెల్యేలు చేతులెత్తడం చూస్తుంటే వీరికి ప్రజల పట్ల ఎంత చిత్త శుద్ధి ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ట్రూ అప్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. ఇది సరిపోదు అన్నట్టు ఇప్పుడు రోడ్లపై టోల్‌గేట్లు పెట్టి ప్రజల వద్ద డబ్బులు వసూలు చేయాలని తుగ్లక్ పరిపాలన గుర్తుకు తెస్తున్నారని అన్నారు. గతంలో ప్రజలు పెంచుకున్న జుట్టు మీద కూడా తుగ్లక్ పన్ను వేశారని, చంద్రబాబు ఆయనను మించిపోతున్నారని ఆరోపించారు. తక్షణమే ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని, లేనిచో ప్రజల నుంచి ఎదురయ్యే వ్యతిరేకతకు ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

గ్యాంగ్ రేప్ నిందితులను శిక్షించాలని నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు

అల్లిపురం: విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు సమాఖ్య ప్రతినిధులు అల్లిపురంలోని చలువతోటలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద తమ నిరసన తెలియజేశారు. సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. వనజాక్షి, ఎండీ బేగం మాట్లాడుతూ నిందితులు ఒక పథకం ప్రకారం విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా నిందితులని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఎ. దేముడమ్మ, సభ్యులు బి.పుష్పలత, సీహెచ్ నూకాలమ్మ, భాను, కొండమ్మ, హేమలత, ముత్యాలమ్మ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్ కాలనీలో గల పౌరగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని, వారంతా విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. మంచిగా చదువుకుని దేశ గౌరవాన్ని చాటిచెప్పే విధంగా ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రంథాలయాల్లో చదువుకుని దేశం గర్వించదగ్గ నాయకులుగా ఎదిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అబ్దుల్ కలాం వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. షిప్‌యార్డ్ కాలనీలో ఉన్న గ్రంథాలయాన్ని గాంధీగామ్ పశువుల ఆస్పత్రి పక్కన నిర్మించేందుకు పలుమార్లు ప్రయత్నించామని, త్వరలోనే ప్రజాప్రతినిధులను కలిసి భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతామన్నారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, మాస్టర్ హరినాథ్, మాస్టర్ మూర్తి, మాస్టర్ రవికిరణ్, పట్నాల వెంకటేష్ పాల్గొన్నారు.

కోటి శివలింగాల తయారీలో మేము సైతం..

- ప్రవాస భారతీయుని సంకల్పానికి 'బౌ్రమాంబ' సమితి సహకారం
- రెండు రోజుల్లో 50 వేల ప్రతిమల తయారీ



తయారు చేసిన శివలింగాలు



శివలింగాల తయారీలో నిమగ్నమైన బౌ్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: ప్రవాస భారతీయ శివభక్తుని సంకల్పాన్ని సాకారం చేసేందుకు అగనంపూడి బౌ్రమాంబ పారాయణ సేవా సమితి సభ్యులు మేము సైతం అంటూ సహకారం అందించారు. రెండు రోజుల్లో 50వేల శివలింగాలను తయారు చేసి ప్రశంసలందుకున్నారు.

కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో పూజల కోసం..

అమెరికాలో నివాసముంటున్న ఒక శివభక్తుడు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కోటి శివలింగాలను తయారు చేయించాలని సంకల్పించారు. ఆ శివలింగాలకు కాశీ విశ్వేశ్వర స్వామి సన్నిధిలో పూజలు చేసిన అనంతరం గంగానదిలో నిమజ్జనం చేయాలని భావించారు. ఈ పుణ్యకార్యాన్ని పూర్తి చేసే బాధ్యతను రాష్ట్రంలోని వివిధ హిందూ సామాజిక సంఘాలకు అప్పగించారు. అందులో భాగంగా శ్రీసింహశైల సేవా సంఘం అధ్యక్షురాలు హరి లక్ష్మి ఆధ్వర్యంలో, విజయలక్ష్మి పర్యవేక్షణలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని విశాఖ జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించారు.

రాజమండ్రి నుంచి మట్టి తెచ్చి..

అగనంపూడికి చెందిన బౌ్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ కల్యాణమండపంలో 50 మంది భక్తుల బృందం రెండు రోజుల పాటు 50వేల ప్రతిమలను రూపొందించింది. ఈ శివలింగాలను తయారు చేయడానికి అవసరమైన బంక మట్టిని రాజమండ్రి నుంచి తీసుకువచ్చారు. వాటికి సుగంధ ద్రవ్యాలను జత చేసి, తయారు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్భంగా స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు విజయలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో పారాయణ సేవా సమితి ప్రతినిధులు వి.లీలా లక్ష్మి, వి.సుబ్బలక్ష్మి, ఎం.సౌజన్య, టి.లక్ష్మి, ఆర్.విజయలక్ష్మి, జి.ధనలక్ష్మి, బి.విజయ కుమారి, బి.తులసి, ఎం.పెద్దిరాజు, ఎం.ప్రవీణ్, సీహెచ్.రామారావు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ స్టాఫ్ కార్యవర్గానికి సన్మానం



సభలో మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: ఐటీఐల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమం కోసం పాటు పడతామని జోన్ -1 నుంచి రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన గాజువాక ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు అన్నారు. జోన్ -1 ప్రాంతీయ సంచాలకుడు ఆర్‌వీ రమణ, ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బి.కూర్మారావు ఆధ్వర్యంలో ఏపీ గవర్నమెంట్ ఐటీఐ, డీఎల్‌టీసీఎస్ స్టాఫ్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని గాజువాక న్యూ ఐటీఐలో బుధవారం ఘనంగా సత్కరించారు. జోన్ -1 నుంచి రాష్ట్ర కార్యవర్గంలో పదవులు పొందిన గాజువాక ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎల్. సుధాకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవుడు, సెక్రటరీ కోట్ల శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నరేంద్రబాబుతో పాటు మూడు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, జీవీ శ్రీనివాసు, అప్పలకొండ, టీవీ గిరి, వి.రఘురాం, బీఏవీసీ కామేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో శివకుమార్, పి.శ్రీనివాసరావు, పీవీ బాలాజీ, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఉక్కు'పై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలి

అగంపూడి: విశాఖ పర్యటనకు ఈ నెల 29న వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు ఐఎన్‌టీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కారు రమణ డిమాండ్‌చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో చేపట్టిన రిలేదీక్షలు బుధవారం నాటికి 1378వ రోజుకు చేరాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు దీర్ఘకాలంగా ఉద్యమాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. పెట్టుబడిదారునికి మేలు చేయడం కోసం వేలాది మందిని రోడ్డుమీద పడేయడం ఎంతవరకు సమంజసమో కేంద్ర ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తి శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, మంత్రి గోపీ నారాయణ, నాయుడు, డీఏస్పీ రెడ్డి, అశోక్, దుర్గారెడ్డి, వి.అప్పలరాజు, తాతాజీనాయుడు పాల్గొన్నారు.